# శ్రీ మహాదేవు రాధాకృష్ణరాజు

ప్రశ్న : అయ్యా, రాధాకృష్ణరాజుగారూ! నమస్కారం మీ జీవితవివరములు తెలుసుకుందామని ఉన్నది. సెలవిస్తారా?

సమా : నమస్కారం. అడగండి చెపుతాను.

ప్రశ్న : మీరు సుమారు 40 సంవత్సరాలనుంచి మృదంగ విద్వాంసులుగా ప్రఖ్యాతి గడించినవా రని మే మనుకుంటున్నాం, అంతేకదా?

సమా : మీ రనుకొన్న కాలంలో మొదటి కొద్దికాలంలో మధ్యస్థ స్థితి కొద్దిగా ఉన్నా 35 సంవత్సరాలుగా మన ఆంధ్ర దేశంలోని పెద్దగాయకులు అనగా కీర్తిశేషులు శ్రీయుతులు పారుపల్లి రామకృష్ణయ్యపంతులుగారు, ద్వారం వెంకటస్వామి నాయుడుగారి వంటి పెద్దవిద్వాంసు లందరికి మృదంగం మీద ప్రక్క-వాద్యం వాయించాను. వా రందరు న న్నాశీర్వదించిన వారే.

ప్రశ్న : అయ్యా, రాజుగారూ! తమ జన్మస్థానం ఏదండీ?

సమా : కృష్ణాజిల్లాలో గుడివాడ తాలూకా, పెదవిరివాడ.

ప్రశ్న : తల్లి దండ్రు లెవరండీ?

సమా : మా నాయనగారిపేరు వెంకటరాజుగారు. మా అమ్మగారు రత్నమ్మగారు.

ప్రశ్న : మిమ్మల్ని మృదంగవాద్యం వాయించాలని పురికొల్పిన పరిష్థితు లేమిటో సెలవిస్తారా?

సమా : మా గ్రామంలోనే భజనగోష్ఠి ఒకటి మా గ్రామస్థు లంతా కలసి ఏర్పాటుచేసికొని రామదాసుకీర్తనలు, తరంగాలు మొదలయినవి పాడుతుంటే మొదట దానిలో గొంతు కలిపి తరువాత మృదంగం వాయిస్తే బాగుండు ననుకొన్నాను.

ప్రశ్న : మరి వెంటనే మృదంగం వాయించారా?

సమా : అసలే నేర్చుకోనిదే ఎలా వాయించటం? అందుకని ఆ భజనగోష్ఠిలోనే మృదంగం వాయించిన శ్రీ శింగరాజు సుబ్బరాజుగారివద్ద నాలుగు మాసాలు అభ్యసించి తరువాత భజనగోష్ఠిలో మృదంగం వాయించాను. దానిలో నా కున్న చొరవను గ్రహించి మా గ్రామపెద్దలు, మా బంధువులు నన్ను 'మార్దంగికాగ్రేసర', శ్రీ పొట్లూరి వీరరాఘవయ్యచౌదరిగారివద్ద 1930-వ సంవత్సరంలో విద్యాభ్యాసం కోసం అప్పగించారు.

ప్రశ్న : బాగుంది రాజుగారూ! దిట్టమైనచోట పడ్డారు. వారి వాద్యం నా చిన్నతనంలో నేనూ విన్నాను. చాలా ఘనంగా ఉండేది. సరే. వారి వద్ద విద్యాభ్యాసం ఎంతకాలం చేశారు?

సమా : ఎనిమిది సంవత్సరాలు చేశాను. వారి ఆశీర్వచనబలం నాకు సంపూర్ణంగా కలిగింది.

ప్రశ్న : కనుకనే మీరు పెద్దవిద్వాంసులుగా ప్రఖ్యాతి చెందారు.

సమా : నా అభిప్రాయం దేనికయినా గురుకటాక్షం మూలమనీ, అందులోనూ మా ఊరి ఆదరాభిమానాలు నాకు మూలధనమై నేటికీ అనువ ర్తిస్తూ ఉన్నవని.

ప్రశ్న : రాజుగారూ, మీ విద్వత్తుకు చిహ్నంగా మీ కేవయినా సన్మానాలు జరిగాయా? జరిగితే చెప్పండి.

సమా : ఏనాటికీ నేను మరవలేని సన్మానం నాకు 1954 ఆగస్టులో జరిగినది. ఆ సభకు కీ.శే. మధ్వశ్రీ కాశీకృష్ణాచార్యులుగారు పర్యవేక్షకులు, సంగీతకళానిధి కీ. శే. శ్రీ ద్వారం వెంకటస్వామినాయుడుగారు అధ్యక్షులుగా పౌరుల తరఫున 5,116 రూపాయల పర్సు బహూకరించారు. అదీకాక సువర్ణఘంటాకంకణాన్ని కీ. శే. శ్రీ పళని సుబ్రహ్మణ్యపిళ్లేగారు చేతికి వేశారు.

ప్రశ్న : ఆ సభకు నేనుకూడా వచ్చాను, ఇప్పుడు జ్ఞాపకానికి వచ్చినది. అటువంటి విద్వత్పరివేష్టితమయిన సభ 'నభూతో న భవిష్యతి' అనుకున్నా రప్పుడు. మరి అప్పు డిచ్చిన బిరుదు సంగతి చెప్పరేం?

సమా : 'మృదంగవాద్యవిశారద' బిరు దిచ్చారు. ఆ బిరుదు మీాది మోజు కంటె నలుగురికి విద్యచెప్పే విషయంలో నాకు మోజు.

ప్రశ్న : ఆ మోజు మీాకు బాగానే తీరింది. ఇదివరలోనే చాలామంది మీావద్ద విద్య నభ్యసించినవాళ్లు పెద్దవాళ్లై ఒకస్థానంలో వున్నారు కదండీ?

సమా : అవును. ప్రభుత్వ సంగీత కళాశాలలో నా ఆశయం ఇంకా ఎక్కువగా ఫలించింది. కళాశాల సేవాసమయంలో ఈ గ్రంథాన్ని ఈవిధంగా వ్రాసి విద్యార్థులకు ఉపయోగకరంగా అందిద్దామనిపించింది.

ప్రశ్న : రాజుగారూ, విద్యార్థులకేకాదు, పాఠ్యప్రణాళికగా విద్వాంసునికీ ఉపయోగమే కదండీ?

సమా : అవును. 1975-వ సంవత్సరంలో నేను పదవీ విరమణ చేశాను. అవతికాలంలో నా ఆప్తుల అందరి సహకారంతోనూ ఈ గ్రంథం వెలువరించగలిగాను.

ప్రశ్న : అయ్యా, మరి మీరు ఆధ్యాత్మికంగా ఏదయినా జపం వంటివి చేస్తారా ?

సమా : నాకు 1956 లో మహాభక్తు లయిన శ్రీ అంబడిపూడి విశ్వనాథంగారు, శ్రీ మల్లాది దక్షిణామూర్తిశాస్త్రిగారు విష్ణుసహస్రనామోపదేశం చేశారు. తదాది నేను దాన్ని జపించికాని ఇంటినుంచి బయటికి రాను. నేను యాత్రగా వెళ్ళినప్పుడు హృషీకేశంలో శ్రీ శివానందస్వామివారి సేవాభాగ్యం కలిగింది. వారు నన్ను "మృదంగజ్యోతీ" అని పిలచి ఆశీర్వదించారు.

ప్రశ్న : మీరు చాలామంది పెద్దపెద్దవారి కచ్చేరీలకు మృదంగం వాయిస్తుండగా నేను విన్నాను. త్యాగరాజు పంచరత్నకృతులు, వర్ణాలు, పాఠంవచ్చినట్లు వాయిస్తారు ఏమిటి కారణం ?

సమా : మా గురువుగారివద్ద అభ్యసించేటప్పుడే కీ. శే. పారుపల్లి రామకృష్ణయ్యాపంతులు గారి శిష్యులు ఎవరో ఒకరు వచ్చి పాడటంచేత అవి నాకు కంఠతః వచ్చినవి.

ప్రశ్న అలాచెప్పండి. అందుకనే మీ వాద్యంలో ఆ రక్తి. మరి మీ వంశం మృదంగ వాద్యవిద్యతో కొనసాగుతోం దనుకుంటాను.

సమా : ఇంతవరకు ఆవిధంగానే వున్నది. నా పెద్దకుమార్తె శ్రీమతి బాదరవాడ రత్నమాల మృదంగవిద్యలో ఒకస్థానానికి వచ్చినది. మా పెద్దవాడు మీ దయవల్ల దానిలోనే ప్రావీణ్యం సంపాదించేటట్లు కనపడుతున్నాడు. 1974 లో ఆలిండియా రేడియో పోటీలలో మృదంగంలో మొదటి బహుమతి గ్రహించాడు. చాలాచోట్ల మంచి కచేరీలలో మృదంగం వాయించాడు. ఇదీ వాని స్థితి.

ప్రశ్న : రాధాకృష్ణరాజుగారూ ! మరి సెలవు. చాలా దయచేసి తెలిపారు. సంతోషం.

విజయవాడ
17 - 6 - '76

పరిచయకర్త
నల్లాన్‌చక్రవర్తి కృష్ణమాచార్యులు,

Source: Press Academy Website, Mrudanga Bodhini Magazine, 1976

Disclaimer: This SELECTIVE topic/article/write-up by Nallanchakravartula Krishnamacharyulu gaaru is nostalgic. It has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience.

No intention what so ever of copy right violation is involved.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with due apologies.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/